# హెలియమ్స్

"దుష్టులకు భయపడటం తాత్కాలికమైనది. అప్పుడప్పుడూ దుష్టశక్తులు అల్లకల్లోలాలు సృష్టించినా అంతిమ విజయం మంచిమనసూ, మానవత్వమూ ఉన్న 'మనిషి'దే."

అవి దిక్కుమాలిన రోజులు !

దొంగతనాలు, దోపిడీలు, హత్యలూను. ప్రాణాల్ని గుప్పెట్లో పెట్టుకుని బతుకుతున్నారు జనం.

కథా స్థలం అమెరికాలో (ఉత్తరమో, దక్షిణమో వదిలేయండి) ఒక మారుమూల ప్రదేశం. మరీ గ్రామమూ కాదు, అల్లాగని పట్నమూ కాదు. ఈ రెండు దశల మధ్యా వున్న ఊరు !

ఆ ఊరి షరీఫు (పోలీసాఫీసరు) మంచివాడూ, గుండె బలం గలవాడూను. మంచి పెర్సనాలిటీ గల్ట్రాలున్నవాడు. ఉద్యోగ నిర్వహణలో సూటిగాపోయే మనిషి. అతని పేరు విలియమ్స్ !

## 2

తన ముందున్న బల్లమీద గట్టిగా గుద్దేశు విలియమ్స్ !

రోషంతో మనిషంతా ఊగిపోతున్నాడు. కళ్ళు రెండూ ఎర్రబడ్డాయి. పిడికిళ్ళు బిగుస్తున్నాయి.

అతని ముందున్న ఉత్తరం - అతన్ని గేలి చేస్తున్నట్టు రెపరెపలాడుతోంది. కోపంవల్ల కలిగిన ఆవేశానికి తట్టుకో లేక, కేకలుపెట్టి ఖంగారు చేయటం యిష్టంలేక - పెదాన్ని కొరుక్కుంటూ అనుకున్నాడు.

"హెలియన్స్! మీ అంతు చూసేస్తాను!"

## 3

ఆ రోజుల్లో....

దొంగతనాలూ, దోపిడీలు, హత్యలకి ప్రసిద్ధి చెందిన ముఠా ఒకటుంది. ఆ ముఠా పేరే 'హెలియన్స్!'

ఊళ్ళకి ఊళ్ళనే దోచుకుపోవడం హెలియన్స్ వృత్తి. వాళ్ళ వృత్తి ధర్మానికి ఎవరయినా అడ్డం పడితే - వాళ్ళ ప్రాణాలకి గ్యారంటీ తక్కువ! ఎదురుపడ్డ మనుషుల్ని పిట్టల్ని కాల్చినట్టు కాల్చిపారేసేవారు హెలియన్స్! ఉత్త నరరూప రాక్షసులు!

హెలియన్స్ పేరు చెబితేనే గడగడ లాడేరు ప్రజలు. హెలియన్సంటే వందలూ, వేలూ గల ముఠాకాదు. కేవలం అయిదుగురే! పైగా, ఆ అయిదుగురూ ఒకే కుటుంబ సభ్యులు. ఒక తండ్రి, అతని తాలూకు నలుగురు కొడుకు లూను. ఈ అయిదుగురే హెలియన్స్.

అయిదుగురయితేనేం- అసాధ్యపు ముండాకొడుకులు.

వాళ్లు చేస్తున్న దురాగతాలు సాహస కృత్యాలని మురిసి పోయే మూర్ఖులు !

వాళ్ళ దృష్టిలో అతి చవకబారు వస్తువులు మనిషి ప్రాణాలు ! వాళ్ళల్లో ఎవడెంత మందిని కడుపున పెట్టుకుంటే వాడంత ఘనుడు.

కొడుకులంటే ఆ తండ్రికి వల్లమాలిన వాత్సల్యం. వాళ్ళమీద ఈగ వాలితే తన్నుకు చస్తాడు. అట్లా పెంచేట్ట వాళ్ళని !

మనుష్యుల్ని కొట్టి చంపడం, కాల్చి పారేయడంలాటి విద్యల్లో పుత్రరత్నాలకి చిన్నప్పట్నుంచీ తర్ఫీదిచ్చి ప్రయో జకుల్ని చేశాడు. తండ్రి మాటకి ఎదురుచెప్పని శ్రీరామ చంద్రులు నలుగురూను.

వాళ్లెంత నరరూప రాక్షసులైనా, చేసే వెధవ పను లన్నీ కూడా 'నీతి' ఏడ్చిందనే ధీమాతో- ఏ ఊరుమీద పడబో తున్నారో, ఆ ఊరికి ముందుగా ఒక తాఖీదు పంపడం వాళ్ళ ఆనవాయితీ !

"ఫలాన తేదీన, ఫలానా టైంకి మీ ఊరుని 'ఉఫ్ కాకి' చేసిపారేస్తాం. మా పవిత్రమైన ఆశయానికి అడ్డం వస్తే, వచ్చిన వాళ్ళని సఫా చేస్తాం. ప్రాణాలమీద తీపి వుంటే (మా కెలాగూ లేదు) మీమీ ఆస్తుల్ని మీమీ ఇళ్ళ లోనే దాచి, మీరంతా ఒక సత్రంలో కాలక్షేపం చేయండి. మీరు దాచుకున్నదంతా మేము దోచుకుపోయేంతవరకూ, మీ వూర్లో మే మున్నంతవరకూ-మీలో ఎవరుగాని ఇదేమి టని అటకాయించారో, లేక సహాయంకోసరం పక్కవాళ్ళకి

కథా నిలయం
656


ఖబురు పెట్టారో-మీ ఊరు మొత్తం శ్మశానంచేసి వెళ్ళగల మని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. కనక ఇంతే సంగతులు. ఇట్లు హెలియన్స్"-ఆవటాంటు ఆ ఉత్తరంలో వ్రాయబడి వుంటుంది.

అలాంటి ఉత్తరాలు కథా ప్రారంభానికి పాతికో ముప్ఫయో రాసివున్నారు. జయప్రదంగా వాళ్ళ కార్యక్రమాన్ని నిర్వహించుకోగలిగారు. ఒక్కో ఊరు దాటుకొస్తుంటే, ఉత్సాహం ఒక్కో మెట్టూ ఎక్కువవుతోంది.

## 4

"బోడి ఉత్తరం! ఛేష్! చాతకాని దద్దమ్మలు ఈ ఉత్తరాన్ని కేర్ చేస్తారు. నే నెందుకు చేయాలి? చేయను!" అనుకున్నాడు విలియమ్స్.

నిజాని కతను చాతకాని దద్దమ్మ కానేకాదు. తుపాకులకే భయపడని పోలీసు మనిషి, ఉత్తరాలకి భయపడతాడా! అందుచేత, అతను ఆ ఉత్తరాన్ని నలిపి చింపబోయాడు.

చింపబోయేముందు ఒక చిన్న ఆలోచనరాగా తల పంకించి, ఆ ఉత్తరాన్ని జేబులో తోసేశాడు.

పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ అతని ఆఫీసు నుంచి బయటకు నడుస్తున్నాడు.

## 5

అంత పోగనిచూస్తే, నిజానికి ఆ క్లబ్బు రామార్పణం అవుతుందనే అనుకోవాలి మరి!

కానీ, తగలబడుతోంది క్లబ్బు కాదు. క్లబ్బు లోపల జానెడుబారున్న చుట్టలు! ఒక్కోడూ గుండెల్నిండా పొగని పీల్చి గుప్‌గుప్‌న వదులుతుంటే-ఒక్కోడికీ ఒక్కో రైలింజను పోటీకి రాలేదు. అంత ఉధృతంగా కాల్చుతున్నారు చుట్టలు!

అల్లాంటప్పుడు, పొగ క్లబ్బంతా ఆవరించింది చాలక, క్లబ్బు బయటికి రాక చస్తుందా! క్లబ్బు అంటుకున్నదని అనుమానం కలక్కపోతుందా ?

ఆ ఊళ్ళో వీరయోధు లెక్కువ! వీధికి ఇద్దరు ముగ్గురు చొప్పున వున్నారు. కొందరు యుద్ధాల్లో పాల్గొని ఇప్పుడు విశ్రాంతి తీసుకుంటున్నారు. కొందరు యుద్ధాలెప్పుడొస్తాయాని తుపాకులు-తుడుచుకుంటూ ఎదురు చూస్తున్నారు. కొందరు కాల్చేందుకు మనుషులు దొరక్క పోవడంవల్ల పిట్టల్ని కాలుస్తూ కాలక్షేపం చేస్తున్నారు.

ఏమైనా, వాళ్ళంతా వీరయోధులే!

వాళ్ళంతా కలిసి ఆ ఊళ్లో ఒక క్లబ్బుని స్థాపించుకున్నారు. దానికి నైట్స్ (యోధులు) క్లబ్బని నామకరణం చేసుకున్నారు.

లయన్స్ క్లబ్బులో సింహాలుండక పోవచ్చునేమో గాని, ఈ నైట్సు క్లబ్బులో అందరూ యోధులే!

ఇంచుమించు ఏభై మంది వుంటారేమో. నలుగురైదుగురు చొప్పున పదీ పన్నెండు టేబిల్స్ ముందు కూచుని వున్నారు. చేసేందుకు చేతినిండా పని లేకపోవడం మూలంగా జూదాల్లో తల దూర్చారు.

చీట్లపేక లొక్కటే జూదానికి పర్యాయపదమని అనుకో

నక్కర్లేదు. చీట్లపేక లేకుండానే యోధులు జూదాలాడ గలరు. ఈ జూదంపేరు యోధుల జూదం!

ఉదాహరణకి—

ఒక వీరయోధుడు కళ్ళకి గంతలు కట్టుకుని, తుపాకీ చేత్తో పట్టుకుని, ఆవరణలో ఒక చెట్టుమీద వ్రేళ్లాడుతున్న పండుని కాల్చే పందెంలో నిమగ్నుడయ్యాడు.

మరో హీరో రెండు చేతుల్లోనూ పిస్తోళ్ళుంచుకుని సిద్ధంగా వున్నాడు. ఎవరో విసిరే టోపీని కిందపడకుండా, పిస్తోళ్ళలోని గుళ్ళు పూర్తయ్యేంత వరకూ కాల్చడమే పందెం.

ముచ్చటైన పందెం మరొకటుంది.

నైట్క్లబ్బు ఆర్గనైజరు జాని (మహావీరుడు). జానెడు చుట్టనీ సుతారంగా కాల్చుతున్నాడు. దాని తాలూకు నుసి కిందరాలితే అతను కొంత పైకాన్ని ఓడిపోతాడు. అల్లా గాకుండా రెండంగుళాల చుట్ట మిగిలి, మిగతాదంతా నుసిగా చుట్టకే అంటుకుపోయివుంటే అతను పందెం గెల్చినట్టే. ఈ గొడవమీద కొంత పై పందేలు. రెండుపక్షాలు. ఒక్కో పక్షానికీ నలుగు రేసి మనుషులు. నైట్క్లబ్ అసిస్టెంట్ ఆర్గనైజరు ఛార్లీ ఈ పందేనికి మధ్యవర్తి.

ఇల్లాగ రకరకాల పందేల్లో మునిగిపోయారు పుర యోధులు! ఎవరెన్ని రకాల పందేల్లోవున్నా - అందరూ చుట్టలు తగలేస్తున్నారు. దేవుడొచ్చి పలకరించినా పలికే స్థితిలో లేరు పాపం!

అల్లాంటిది—

విలియమ్స్ కంచుకంఠానికి ఆ క్లబ్బు యావత్తూ గౌర వాన్నిచ్చింది. అక్కడికి ఎప్పుడూరాని విలియమ్స్ ఇవాళెం దుకు వచ్చాడోనని ఆశ్చర్యపోతున్నారు యోధులు. ఆ ఆశ్చ ర్యమే గౌరవంగా మారింది.

"జెంటిల్మెన్!" అన్నాడు విలియమ్స్.

ఎవరికి వాళ్ళు చుట్టలు చేత్తోపట్టుకుని చెవులప్పగించి శ్రద్ధగా వినేందుకు కుతూహల పడుతున్నారు.

"నేను భయపడి ఇక్కడికి రాలేదు. షరీఫ్‌గా నా విధ్యుక్త ధర్మమేమిటో నాకు బాగా తెలుసు. నాకొచ్చిన ఉత్తరం ఏమిటో మీకు చెప్పడం నా విధిగా భావించాను గనక వచ్చాను," అన్నాడు విలియమ్స్.

ఉత్తరమనే మాట చెవుల పడంగానే, పందేల గోల పూర్తిగా మరచిపోయారు యోధులు. సర్దుకూర్చున్నారు.

జాని అడిగాడు—

"ఏమిటా ఉత్తరం!"

విలి : చెబుతాను. చెప్పేముందు- ఈ ఊళ్లోవున్న వీర యోధుల పరిచయభాగ్యాన్ని నాకు అనుగ్రహించండి.

యోధులు ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. ఛార్లీకి వళ్ళు మండిపోయింది. అరిచాడు.

ఛార్లీ : ఇది నైట్‌స్‌క్లబ్. ఇక్కడంతా వీరయోధులే వుంటారు. వేరే పరిచయాలు అనవసరం! మమ్మల్ని అవమా నించాలని వచ్చినట్టయితే దానికి తగిన శిక్షేమిటో గూడా చెప్పడం మంచిది.

ఛార్లీ మాటకి విలియమ్స్ బాధపడ్డాడు.

విలి : "అవమానమా! ఆ ఉద్దేశం నాకు లేదు. నా మాటతీరు మీకలా కనిపిస్తే నన్ను తప్పకుండా క్షమించాలి!

జాని అసహనంగా అన్నాడు....

జాని : ఉత్తరం గొడవేదో కానివ్వండి.

విలి : మీకది చాలా అల్పమైన సమాచారమే! సారాంశం వింటే ఉత్తరం రాసినవాడినీ; వాడి ముఠానీ చంపి పారేస్తారని నాకు తెలుసు. అంత పనిచెయ్యకుండా వాళ్ళని పట్టి చట్టాని కప్పగిస్తే నాకు మేలు చేసినవారవుతారని నా మనవి.

ఛార్లీ మరింత మండిపడ్డాడు....

ఛార్లీ : సోది చెప్పి మా కాలాన్ని పాడుచేయడం షరీఫ్‌కి మర్యాదకాదు. కమాన్, సారాంశం వద్దు. రాసిందెవరో చెప్పండి చాలు. నల్లుల్ని నలిపినట్టు నలిపి పారేగలం! ఆ!

ఛార్లీ ఛాలెంజిని ఆసరాగా తీసుకుని జాని అన్నాడు...

జాని : షరీఫ్ సాయం మా కక్కర్లేకపోయినా, మా సాయం షరీఫ్‌కి అవసరమని మాకు బాగా తెలుసు. వాళ్ళ అడ్రసివ్వండి.

విలి : వాళ్లు 'హెలియన్స్!'

అంతే!

క్లబ్బంతా ఉలిక్కి పడ్డది, గుసగుసలు ప్రారంభమయ్యాయి. విలియమ్స్ ఉత్తరంతీసి ఒక యోధుడి కిచ్చేడు. ఆ యోధుడు చదివి పక్కవాడి కిస్తున్నాడు. ఆ విధంగా

ఉత్తరం చేతులు మారుతుందేగాని ఎవరూ నోరువిప్పి మాట్లాడటం లేదు.

విలియమ్స్ అప్పీలు చేస్తున్నాడు....

విలి: జెంటిల్మెన్! వాళ్ళు అయిదుగురు మాత్రమే! హంగులేని నాలుగైదు ఊళ్ళని దోచుకుని, అదే ఘన కార్యంగా భావించి విర్రవీగుతున్న అయిదు పక్షులు. బహుశా మన ఊరి గురించిగానీ, ఇక్కడ ఈ నైట్సుక్లబ్ చరిత్ర గానీ వాళ్ళకి తెలీకపోవచ్చు. అందుచేతనే వచ్చే పదహారున మన ఊరిమీదికి దాడికొస్తున్నట్టు రాసేరు ఫూల్స్! మీ రెవరూ ఆవేశపడకండి. వాళ్ళ ప్రాణాలు తీయకండి. వాళ్లని ప్రాణాల్తో బంధించి చట్టానికి అప్పగించే బాధ్యతని నాతో పాటు మీరూ తీసుకోండి.... మీ నిర్ణయ మేమిటో చెబితే వెళ్ళిపోతాను.

క్లబ్బంతా భయాందోళనలతో నిండిపోయింది. ఏమని చెబితే ఏం ప్రమాదమోనని నోళ్లు మూసుకున్నారు వీర యోధులు.

హెలియన్స్ గురించి వాళ్ళంతా విని వున్నారు. మాయదారి ఉద్యోగ ధర్మమాని ఈ షరీఫ్‌గాడు ఆవేశంతో ఊగిపోతున్నాడేగాని, వాళ్ళెంత ప్రమాదమైన మనుషులో తెలుస్తే గుండె ఆగి చస్తాడని వాళ్ళంతా విలియమ్స్ మీద జాలిపడుతున్నారు.

వీరయోధుల మవునాన్ని గమనించి విలియమ్స్ బెంగ

పడ్డాడు. తను ఆశించిన విధంగా ఆ గుంపులో ఆవేశం కనిపించకపోగా, దిగులూ-విచారాన్నీ పసిగట్టి సిగ్గుపడుతున్నాడు.

విలి : జెంటిల్మెన్! మీరెవరూ ఖంగారు పడనవసరం లేదు. వాళ్లు అయిదుగురే!

ఛార్లీ : అయితే మాత్రం? ఇది ప్రాణాల్తో పని!

విలి : మనమంతా నిలబడితే వాళ్లు సోదిలోకూడా రారు.

ఛార్లీ : జానీ, నేనూ, తదితర కార్యవర్గ సభ్యులూ బాగా ఆలోచించిగానీ మా నిర్ణయం చెప్పలేం.

రేపు రండి.

విలి : ఎల్లుండే పదహారు!

ఛార్లీ : తెలుసు. తేదీలు గుర్తు చేయకండి. వెళ్ళి రండి.

విలియమ్స్ వాళ్ళ సమాధానానికి కృంగిపోయాడు. నోరు తడి చేసుకుని ఏదో చెప్పబోయాడు-ఛార్లీ ఉలిక్కిపడి అరిచాడు.

ఛార్లీ : ఉపన్యాసాలొద్దు! పిడుగులాటి వార్త చెప్పి మీటింగులు కూడానా? మీకో దణ్ణాం. రేపటివరకూ కనిపించకండి బాబూ! వెళ్ళండి.

వాళ్ళ మాటల్తో గెంటబడ్డాడు విలియమ్స్. సిగ్గుతో, అవమానంతో అడుగులో అడుగు వేసుకుంటూ క్లబ్బు దాటుతున్నాడు.

జానీ గుండెమీద చేయి వేసుకున్నాడు. నిలువెల్లా వణికిపోతున్నాడు. ఛార్లీ జానీని సముదాయిస్తున్నాడు.

ఛార్లీ : జానీ! గుండె దిటవు చేసుకో. షరీఫ్‌కి మనం మద్దతిస్తామని చెప్పలేదుగా! హెలియన్సంటే భయపడని వాడు అడ్డగాడిదయ్యా! గుండెమీద చేయితియ్!

# 6

ఎండ దంచేస్తోంది.

అంత ఎండలోనూ అయిదు గుర్రాలూ చొంగ కార్చుకుంటూ పరుగెడుతూనే వున్నాయి. ఆయాసంతో వాటి డొక్కలు ఎగిరెగిరి పడుతున్నాయి.

గుర్రాలే కాదు, గుర్రాల మీదున్న హెలియన్స్ కూడా అవస్థగానే వుంది. ఒకళ్ళతో ఒకళ్ళు చెప్పుకోడం లేదుగానీ, ఒకటే హైరాణా పడిపోతున్నారు.

హెలియన్స్‌లో చిన్నవాడూ, తండ్రికి అత్యంత ప్రీతి పాత్రుడూ అయిన జిమ్ చిరాగ్గా తండ్రిని అడిగాడు.

జిమ్ : నీయక్క! ఆ ఊరింకా ఎంత దూరం నాన్నా!

తండ్రి నవ్వేసి అన్నాడు.

తండ్రి : నీ కేదొచ్చినా పట్టుకోలేంరా అబ్బాయ్! అక్కడికి రేపటిగ్గాని చేరుకోలేం.

ఆ మాటవిన్న జిమ్ గుర్రం డొక్కలో కాల్తో కొట్టి, ఒక బూతుమాట కూసి గుర్రం వేగాన్ని పెంచాడు. రౌతు హృదయాన్ని తాపులో తెలుసుకున్న గుర్రం తూనీగలాగా దౌడు తీస్తోంది.

చిన్నకొడుకు ఉక్రోషాన్ని గమనించి తండ్రి గర్విస్తున్నాడు....

# 7

నిన్నటినుంచీ పరాగ్గావున్న విలియమ్స్‌ని విచిత్రంగా పరిశీలిస్తోంది- అతని భార్య మేరి! తను పది మాటాడుతుంటే వుండీవుడిగీ ఒక్క మాటకి బదులిస్తున్నాడు విలియమ్స్. సంగతేమిటో తేల్చేసుకోవాలనుకుంటోంది మేరి.

విలియమ్స్ డ్రస్ చేసుకుంటున్నాడు. అతని చొక్కా గుండీలు పెడుతూ అడిగింది—

మేరి : నిజం చెప్పు విల్లీ! ఎందుకింత ముభావంగా వుంటున్నావ్?

విలియమ్స్ ప్రేమగా భార్యని దగ్గిర తీసుకుని ముద్దు పెట్టుకున్నాడు. ఆ తర్వాత అన్నాడు.

విలి : వేళవుతోంది. వెళ్లాలి!

మేరి : నా ప్రశ్న అల్లాగే వుండిపోయింది.

విలి : ఇవాళ సాయంత్రం చెబుతాను. సరా! అవతల నైట్క్లబ్బులో పెద్దలంతా నాకోసం ఎదురు చూస్తూంటారు వెళ్లొస్తా డార్లింగ్!

—అనేసి భార్య మాటకి ఎదురు చూడకుండానే చకచకా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు విలియమ్స్.

నైట్క్లబ్బేమిటీ? అక్కడ పెద్దల్తో అంత రాచకార్యమేమిటీ? పిచ్చి తన కెక్కిందో, భర్తకే పట్టిందో అర్థంగాక వెర్రిచూపులు చూస్తోంది మేరి!

# 8

నైట్క్లబ్బంతా హడావిడిగావుంది! ఒకళ్లు మాటాడు తున్నది ఒకళ్ళకి వినిపించకుండా ఒకటే రొదగా వుంది.

విలియమ్స్ నిలబడేవున్నాడు. అతనికి అధికారమంటూ ఇస్తే ఈ వీరయోధుల్ని పిచ్చికుక్కల్ని కాల్చినట్టు కాల్చి చంపాలన్నంత కసిగావుంది.

వీళ్ళా వీరయోధులు ? సిగ్గు సిగ్గు !

చుట్ట ఒకచేతిలో పెట్టుకుని, మరోచేత్తో గుండె పట్టు కుని కూచున్నాడు జానీ. ఛార్లీ విసుక్కుంటూ అన్నాడు.

ఛార్లీ : జానీ ! అస్తమానం గుండెమీద చేయి వేసు కూర్చోకు. చిరాగ్గా వుంది. లేచి నిలబడు. మన నిర్ణయ మేమిటో విలియమ్స్‌కి చెప్పు. ఊ ! కమాన్ బోయ్! క్విక్ ! అవతల ముంచుకొస్తోంది.

జానీ అకస్మాత్తుగా లేచి నిలబడ్డాడు. వీరయోధులంతా మవునం వహించారు. జానీ గుండెమీద చెయ్యి వుంచుకునే మాటాడుతున్నాడు.

జానీ : మిస్టర్ విలియమ్స్! గురి తప్పకుండా కాల్చి సెహభాష్ అనిపించుకున్న చరిత్ర మా అందరికీ వుంది. అయితే, ఈ మధ్యకాలంలో ప్రాక్టీసులేక చేతులు వణుకు తున్నాయి. అందునల్లనే, నాబోటివాడు సైతం - తుపాకీ కాల్చడం మానేసి చుట్టలు కాల్చుతున్నాడు. పోనీ, ప్రాక్టీసు చేద్దామంటే ఆ వెధవలు రేపటికే ముహూర్తం పెట్టేరు. వాళ్ల జీవితమంతా మనుషుల్ని కాల్చడంలోనే ఖర్చు పెడుతున్నారు.

గనక, వాళ్ళ గురికి ఇంతమందిమి ఆహుతి అవడం ఇష్టం లేదు. అందువల్ల- వాళ్ళ కోరిక ప్రకారం, మా సర్వదాస్థినీ మా మా ఇళ్ళల్లో వదిలేసి, మా పిల్లాజెల్లాతో ఈ నైట్సు క్లబ్బులో కాలక్షేపం చేద్దామని నిర్ణయాని కొచ్చేం. బాధ్యగల ఆఫీసరువి. వాళ్ళని కాల్చి పుణ్యం కట్టుకుంటావో, వాళ్ళ చేతుల్లో ప్రాణాలే పోగొట్టు కుంటావో, లేదూ - మా అందర్తో కలిసి విశ్రాంతి తీసుకుంటావో- అదంతా నీ యిష్టం! నీ వ్యక్తిగతమైన వ్యవహారం! ఇంతకంటే ఎక్కువగా చెప్ప వలసిం దేమిలేదు.

అని టపిక్కున కూర్చున్నాడు జానీ!

విలియమ్స్ నీళ్ళు కారి పోయేడు. బక్క కోపంతో పళ్ళని కొరుక్కుంటున్నాడు. గుప్పిట బిగించేడు. ఏమి చేయ డానికీ తోచక అటూఇటూ చూసి ఒక్క గెంతులో క్లబ్బుని దాటి బయట పడ్డాడు.

## 9

ఒక చిన్న నీటి వాగు దగ్గర గుర్రా లాగేయి!

జిమ్ తన చేతుల్లో ఊసుకుని మొహానికి రాసు కున్నాడు. మెళ్ళో మురికి గుడ్డని తీసి తుడుచుకున్నాడు. ఆనక నీటి వాగులోకి దిగి కాళ్ళూ, చేతులూ కడుక్కుంటున్నాడు.

మిగతా ముగ్గురు సోదరులూ మొహమ్మీద నీళ్ళు చల్లుకుని, నీళ్ళు తాగుతున్నారు. వాళ్లలో ఒకడన్నాడు.

సోద: ఒరే అన్నాయ్! ఈ నీళ్ళన్నీ సారా కాకూడదా! కడుపునిండా పుచ్చుకునేవాళ్ళం!

అన్నయ్య: కొంచెం ఓపిక పట్రా! ఊరు చేరంగానే పీపాలు పీపాలే పట్టేయొచ్చు!

వాళ్ళ మాటలు వింటున్న జిమ్‌కి ఒళ్లు మండిపోయింది. కోపంగా అన్నాడు.

జిమ్: ఓరి మీయమ్మ! ఊరుఊరని చంపేస్తున్నారు గందరా! ఇంకా ఎంత దూరంరా ఆ ముదనష్టపు ఊరు!

అన్నయ్య: నోరు ముయ్యి! అతిగా వాగకు.

జిమ్: లేకపోతే ఏంట్రా? అసలొరేయ్ ఆ ఊరు చేరేలోగా మన ప్రాణా లుంటాయో ఊడతాయో ఆ సంగతి చూడంట్రా ముందు! ఇంక ఏ ఊరూ దొరకనట్టు, ఆ పుండాకోర్ ఊర్ని ఎంచుకున్నందుకు ముసలాడ్ని తిట్టాలి!

గట్టుమీదున్న ముసలాడు కులాసాగా నవ్వి అన్నాడు.

ముస: సుబ్బరంగా విశ్రాంతి తీసుకోండి. మరో గంటలో బయలు దేరాలి.

## 10

మేరీకి జరిగిందంతా చెప్పేడు విలియమ్స్.

మేరీ హెలియన్స్ రాకనీ, యోధాను యోధుల నిర్ణయాన్నీ విని ఖంగారుపడి పోయింది. కొమ్ములు తిరిగిన మొనగాళ్ళే మా వల్ల కాదని మాటా- ముల్లే ఇంట్లో పదిలి ముక్కు- మూసుకుని కాలక్షేపం చేస్తుంటే - ఈ మొగుడు బడుద్ధాయి ఏం అఘాయిత్యం చేస్తాడోనని బెంగతో మెల్లిగా అడిగింది.

మేరి: అయితే, నిర్ణయ మేమిటిటా!

విలి : ఎవరికి తప్పినా నాకు తప్పదుగా మేరీ! నా వంట్లో చివరి నెత్తురుబొట్టు చిందేవరకూ ఆ వెధవల్ని ఎదుర్కుంటాను.

మేరి : (భయంతో) విల్లీ!

విలి : వాళ్లు నా చేతుల్లో చచ్చేరా—అరాచకాన్ని అరికట్టగల వాడినవుతాను. లేదూ, వాళ్ళ చేతుల్లో నేను చస్తే—కొందరి మూర్ఖుల్ని కాపాడే నిమిత్తం ప్రాణాలు పోగొట్టుకున్నాననే కీర్తయినా దక్కుతుంది.

మేరి : (కోపంతో అన్నది) నీ కీర్తి దురద మండిపోను! వద్దు. నా మాటవిని వాళ్ళకి లొంగిపో!

విలి : నోరుముయ్! పిరికిమందు పోయకు.

మేరి : లొంగకపోతే మానే, గడపదాటి బయటకు వెళ్ళకు. వాళ్ళ కళ్ళకగ్గనిపించకు.

విలి : ఆడంగి వెధవనిపించుకోనా? ఇంత బతుకూ బతికి!

మేరి : అన్నంత మాత్రాన అవుతావా?

విలి : మేరీ! ప్రాణాలకి భయపడి ఇంటో దాక్కుంటే రేపు వాళ్లు ఎవర్నయినా చంపితే నా ఉద్యోగం ఏంగానూ! నా మర్యాద మట్టి కలిసిపోదా?

మేరి : ఆ స్థితి గనక వస్తే విజృంభించు. కాదనను. నువ్వు చెప్పింది వింటే, వాళ్ళ చేతుల్లో చావడానికి ఈ ఊళ్ళో ఎవరూ సిద్ధంగా లేరని సుళువుగా అర్థమవుతోంది. విల్లీ! ఇంత కాలమూ నిన్నేమీ కోరలేదు. ఈ ఒక్క కోరికా చెల్లించవూ?

విలి : ప్రాధేయపడి నన్ను అశక్తుడ్ని చేయకు మేరీ!

మేరీ : నా అదుపులో వుంటే కాళ్ళూ, చేతులూ కట్టి స్టోర్ రూంలో వుంచేదాన్ని. లేవుగనక నే నా మాట వినమని ప్రార్థిస్తున్నాను.

భార్య మాటని కాదనలేకపోయాడు విలియమ్స్. చివరికి ఆమెకు లొంగిపోయాడు. కానీ, ఒక షరతు మాత్రం ఖరా ఖండీగా చెప్పాడు.

విలి: ఇప్పుడే చెబుతున్నా! ఆ వెధవలవల్ల ఈ ఊళ్లో ఏ ఒక్కరికి ప్రాణహాని జరిగినా, జరుగుతుందని తెలిసినా నే నాగను. నీ కన్నీళ్ళూ, వేడికోలూ నన్నాపలేవు. తుపాకీతో ఆ పింజారీ వెధవల్ని ఎదుర్కొంటాను. సమ్మతమేనా?

సమ్మతమే అన్నట్లు మేరీ తలూపింది.

## 11

తెలతెలవారుతూండగా హెలియన్స్ ఆ ఊరు పొలిమేరలు చేరుకున్నారు.

పొలిమేరలు చూడగానే జిమ్ తన దగ్గరనున్న కొద్ది సారానీ పూర్తి చేసి ఖాళీ సీసాని పైకి ఎగరేశాడు. అది కింద పడుతూండగా పిస్తోల్తో ఆ సీసాని తుత్తునియలు చేశాడు.

ముసలాడు వెకిలిగా నవ్వి అన్నాడు.

తండ్రి : సెభాష్! ఉత్సాహమంటే అల్లాగుండాలి. ఊళ్ళోకి వస్తున్నాంరా జిమ్! ఇంక, నీ చేతినిండా పనే!

జిమ్ : చేతుల్లో ఊసుకుని మొహానికి రుద్దుకున్నాడు.

మెళ్ళో వున్న మురికిగుడ్డని తీసి మొహం తుడుచుకున్నాడు. తాపీగా అడిగాడు.

జిమ్ : అదన్రేగాని ముసిలాడా! ఈ ఊళ్ళో ఒక్క నాకొడుకూ ఎదురు తిరక్కపోతే నా ఉత్సాహం ఏం గావాలి?

అన్నయ్య : అవున్రా జిమ్! మా చేతులు గూడా తెగగులగా వున్నాయి. కనీసం ఒక్కడైనా వెయ్యకపోతే కుతి తీరదు!

తండ్రి : మనం వచ్చిన వేళావిశేషం బాగుంటే మీ కరువు తీరుతుందిలేరా అబ్బాయిలూ!

జిమ్ అసహ్యంగా నవ్వి అన్నాడు.

జిమ్ : ఒకవేళ అట్టా జరక్కపోతే నిన్నే కాల్చిపారేస్తాను జాగర్త!

ఆ మాట తండ్రికి చురకలాగా తగిలింది. వేడిమీద అన్నాడు—

తండ్రి : నన్ను చంపాలనుకుంటే ఆ దేవుడే మళ్లా పుట్టాల్రా వెర్రినాకొడకా! నా ప్రాణాలంటె మజాకా అనుకున్నావా? కబడ్దార్!

తండ్రి వెర్రిరోషానికి పిల్లలంతా గలగలా నవ్వేసుకుంటున్నారు. ఆ పకపకలూ, వికవికల్తో - పొలిమేర దగ్గిర వంటిగావున్న ఇంటిని చేరుకున్నారు. ఆగారు. గుర్రాలు దిగారు.

ఆ ఇల్లు చిన్నదైనా ముచ్చటగా వుంది. పరిశుభ్రంగానూ వుంది. ఇంటిముందు గొడ్ల చావిడీ వుంది.

గాల్లో పిస్తోల్ని కాల్చి, చావిట్లో పశువుల్ని చెల్లాచెదర

చేశాడు జిమ్. పశువులు ఖంగారు పడుతూంటే యింకా యింకా కాల్చి ముచ్చట పడుతున్నాడు.

ఈ హడావిడికి ఆ ఇంటి యజమాని తుపాకీతో బయటకు వచ్చాడు. హెలియన్స్‌ని చూశాడు. ఎందుకొచ్చారని అడిగాడు-రోషంగా. జిమ్‌కూడా రోషంగానే సమాధానం చెప్పాడు. మాటా మాటా పెరిగింది. ఇంటి యజమాని తుపాకీ ఎత్తాడు కాల్చేందుకు—

అంతే!

జిమ్ చేతుల్లో పిస్తోలు పొగ్గా పేలింది. ఇంటి యజమాని గుండెల్లోకి తూటా దూసుకుపోయింది. గావుకేక పెట్టి కుప్పలా కూలిపోయాడు ఇంటి యజమాని.

ఏమీ జరగనట్టు - గుర్రాలెక్కి- విలాసంగా పాడుకుంటూ వెళ్ళిపోతున్నారు హెలియన్స్.

## 12

ఆ ఊళ్లో పిస్తోళ్ళు, తుపాకుల వ్యాపారి ఒకడున్నాడు. పేరు జార్జి. ముప్పై ఏళ్లుంటాయి. అజాత శత్రువు. నోట్లో నాలుక లేని మనిషి. ఎవర్తోనూ అధికంగా మాటాడడు. ఎవరైనా పలకరిస్తేనే తప్ప పలకడు.

స్వల్ప లాభాల్తో న్యాయమైన ధరలకి అతను పిస్తోళ్లూ, తుపాకులూ అమ్ముతుంటాడు. ఈ మధ్యకాలంలో జార్జి స్థితి కొంచెం దెబ్బతీసిందనే చెప్పాలి. వూళ్లో వున్న వీరయోధులు రొఖ్ఖమిచ్చి కొనడం మాని ఖాతాలు పెట్టేస్తున్నారు. కొందరు అనుకున్న వేళకి జమ కడుతున్నారు పుణ్యాత్ములు. కొందరు

వాయిదాలు వేస్తుంటే-మరి కొంతమంది నీ చేతనైంది చేసు కోమని ఎగగొడుతున్నారు.

వాళ్ళేం చేసినా నోరెత్తి మాటాడేవాడుకాదు జార్జి. చిద్విలాసంగా నవ్వి వూరుకునేవాడు. అక్కడికీ అతని భార్య బెట్టీ-మొగుడ్ని సరిదిద్దుదామని చాలా ప్రయత్నించింది. అతని సమాధానం మాత్రం ఎప్పుడూ ఒకటే....

జార్జి: చూడు బెట్టీ! ఊళ్ళో ఈ వీరయోధుల్ని నమ్ముకునే ఇంత వ్యాపారం తలపెట్టాం. నిలబెట్టినా, నేలమట్టం చేసినా అంతా వాళ్ళ దయే! ఏదెల్లా జరగాల్సింది అల్లా జరుగుతుంది. వదిలెయ్. వాళ్ళమీద నీకు కోపం వున్నట్టు తెలుస్తే మన కొంపే మునుగుతుందే పిచ్చిదానా! ఈవూళ్ళో మనకి నీళ్ళుగూడా పుట్టనివ్వరు. కాస్త నోరు సంబాళించుకో!

బెట్టీకి భర్తపట్ల విపరీతమైన జాలి! ఈ మనిషి గుండె ఏ పదార్థంతో తయారైందోగాని-వట్టి పుణ్యకాలపు మనిషి. ఎల్లా బాగుచేస్తావో నీదే భారమని దేవుడ్ని ప్రార్థించడం అలవాటు చేసుకుంది.

జార్జి అతిమంచితనం అతన్ని చేతగాని వాడ్నిగా తయారుచేసింది. ఆ ఊళ్ళో అతనొక చలిచీమలాగా కాలం వెళ్ళబుచ్చుతున్నాడు.

చీమా అని పిలిచినా, జార్జి అని పలకరించినా 'ఓయ్' అంటాడు. ఎవరెల్లా, ఏ పేరుతో పిలిచినా పేచీ లేదంటాడు.

ఈ చీమలాటి జార్జికి భార్య బెట్టీ అన్నా, ఏడేళ్ళ కొడుకు హెన్రీ అన్నా వల్లమాలిన ప్రేమ. ఆ ముగ్గురూ

బతకడానికి కనీసవసతులు దేవు డనుగ్రహిస్తే అదే పదివేలని సరిపెట్టుకునే జాతిమనిషి జార్జి.

—పక్క వూళ్ళో సరుకులుకొనే నిమిత్తం గుర్రబ్బగ్గీని సిద్ధం చేశాడు జార్జి. హెన్రీని ముద్దాడుతూ, వాడిని బగ్గీలో కూచోబెట్టుకున్నాడు. జార్జి కూడా బగ్గీ నెక్కాడు. బెట్టీ చెయ్యూపుతూండగా గుర్రాన్ని పరుగెత్తించాడు.

## 13

హెలియన్స్ పాడుకుంటూ ఊళ్లోకి వస్తున్నారు.

అయిదుగురూ అయిదు దెయ్యాల్లాగా వున్నారు. దుమ్ముకొట్టుకున్న బట్టల్తో, చెమట కారుతున్న శరీరాల్తో, జిడ్డు మొహాల్లో మహా బీభత్సంగా వున్నారు. చేతుల్లో పిస్తోళ్లు సిద్ధంగా వుంచుకుని పరిసరాలు చూసుకుంటూ దర్జాగా వస్తున్నారు.

విలియమ్స్ ఇల్లు దాటుతూండగా—

హెలియన్స్ రాకని పసిగట్టిన విలియమ్స్ అకస్మాత్తుగా తుపాకీ తీసుకుని కిటికీ వారగా నిలబడి, కిటికీ గుండా వాళ్ళని చూస్తున్నాడు. తుపాకీ గుండుకి అందే దూరానికి హెలియన్స్ రావడంతోటే, తుపాకీ ఎత్తి గురిచూస్తున్నాడు.

తపీమని తుపాకీ పక్కకి జరిగింది. అది ఇప్పుడు మేరీ గుండెమీద వుంది. విలియమ్స్ మేరీని చూసి తుపాకి దించి కోపంగా అన్నాడు.

విలి : ఏమిటీ ఆగడం ! నీకు బుద్ధుందా లేదా? తుపాకీ పేలితే ఏమయ్యేదానివో తెలుసా !

మేరి : (గంభీరంగా అన్నది) చచ్చేదాన్ని! అంతేగా! కాల్చు విల్లీ! ముందు నన్నుగాల్చి తర్వాత ఆ వెధవల్ని కాల్చు.

విలి : మేరీ !

మేరి : నువ్వు నాకేమని మాటిచ్చావ్? ఇప్పుడేం చేయబోతున్నావు?

మేరీ కళ్ళనిండా నీళ్ళు చేరాయి. పెదాల్ని కొరుక్కుంటూ ఒక్కో మాట బరువుగా అంటోంది.

మేరి : విల్లీ! ఒకటీ రెండు రోజులకంటే ఈ వెధవలిక్కడ కాపరం చేయబోరు. ఈ రెండురోజుల ఉపద్రవాన్ని మనసు కుదటపరుచుకుని గడిపేస్తే వందేళ్ళు నిశ్చింతగా బతకొచ్చు. నాకు బతకాలనివుంది విల్లీ! తొరగా చావాలని లేదు, పైగా-దిక్కుమాలిన చావు- పరాయివాడిగ్గూడావద్దు విల్లీ....వద్దు....

విలియమ్స్ తుపాకీని కింద పారేశాడు. కిటికీకి ఆనుకు నిలబడి సిగరెట్టు ముట్టించుకున్నాడు. హెలియన్స్ని చూస్తూనే వున్నాడు.

అతని నోట్లో సిగరెట్టు అతికోపంతో ఎర్రగా కాలుతోంది!

## 14

నైట్ క్లబ్ లో జానీ గుండెలమీద చేయి వుంచుకుని పిచ్చి చూపులు చూస్తున్నాడు.

ఛార్లీ మరి కొందర్తోపాటు కిటికీ దగ్గరికి చేరాడు. ఒక్కో కిటికీ దగ్గర ఒక్కో గుంపు చేరివుంది.

హెలియన్స్‌ని స్పష్టంగా చూశాడు ఛార్లీ. కిటికీని వదిలి గాభరాగా జానీ దగ్గరకొచ్చి అన్నాడు....

ఛార్లీ : జానీ! గుండెమీద చెయ్యితియ్ !రా ! కిటికీలోంచి చూడు. అయిదుగురు ! అయిదుగురు జానీ !

జానీ నోటినుంచి ఒక్కమాటా రాలేదు. శిలా ప్రతిమలా కూచుని శూన్యంలోకి చూస్తున్నాడు.

నైట్క్లబ్ —

ఆడామగతో, పిల్లాజెల్లాతో కిటకిట లాడిపోతోంది !

## 15

జార్జి గుర్రబ్బగ్గీని హుషారుగా తోలుతున్నాడు.

తండ్రి పక్కన బుద్ధిగా కూచున్నాడు హెన్రీ. వాడి జుత్తు గాలికి సుతారంగా ఎగుర్తూ, అప్పుడప్పుడు కళ్ళమీద పడుతున్నప్పుడు తన ముద్దు చేతుల్తో పైకి ఎగతోసుకుంటూ, చిలిపి కళ్ళతో చుట్టుపక్కల చూస్తున్నాడు.

జార్జి, హెన్రీ చేష్టల్ని గమనిస్తూ ముచ్చట పడుతున్నాడు. బండి పరుగెడుతూనే వుంది.

ఉన్నట్టుండి—

దూరంగా గుర్రాలు పరుగెత్తుకుని వస్తున్నట్టు శబ్దమవ్వగా, తన బండి వేగాన్ని తగ్గించాడు జార్జి. ఇప్పుడు మెల్లిగా తోలుతున్నాడు.

రానురాను గుర్రాల డెక్కల చప్పుడు స్పష్టంగా విని

పిస్తోంది. వాటితో పాటు గాల్లో పేల్చుతున్న పిస్తోళ్ళ చప్పుడు వినిపిస్తోంది.

జార్జి భయపడ్డాడు. హెన్రీని వళ్ళో కూచోబెట్టు కున్నాడు.

హెన్రీకి తండ్రి వాలకం విడ్డూరమనిపించింది. తండ్రి మొహం వేపు వింతగా చూస్తున్నాడు. జార్జి, హెన్రీని గుండె లకు హత్తుకుని అన్నాడు.

జార్జి : ఎవరో, రౌడీలొస్తున్నారు కన్నా! భయ పడకు.

దిక్కుతోచని స్థితిలో బండిని మెల్లిగా లాగుతోంది గుర్రం. జార్జి గుండెలు జారిపోతున్నాయి.

వికృత రూపాల్లో జార్జి బండిముందు ప్రత్యక్ష మయ్యారు హెలియన్స్! గుర్రం కళ్ళెన్ని లాగి బండిని ఆపాడు జార్జి.

హెలియన్స్‌లో ముసలాడు జార్జిని దబాయించాడు.

తండ్రి : ఎవర్రానువ్వు ?

జార్జి గుండెలు దూదిపింజలై పోయాయి. వణికిపోతూ వినయంగా బదులిచ్చాడు.

జార్జి : నా పేరు జార్జి. ఈ వూరి మనిషిని. సరుకులు కొనుక్కోడానికి పక్కవూరు వెడుతున్నాను. ఈ పసివాడు మా అబ్బాయి-హెన్రీ! వాళ్ళకి సెల్యూట్ చెయ్యి కన్నా!

తండ్రి మాటకి హెన్రీ మొరాయించాడు. గారాంగా అన్నాడు.

హెన్రీ : తోడేళ్ళులాగా వున్నారు. వీళ్ళకి సెల్యూట్ చేయమంటావే నాన్నా ! చెయ్యను.

హెలియన్స్ ముసలాడు, హెన్రీని ఉరిమురిమి చూస్తున్నాడు. జార్జి తడబడుతూ అన్నాడు.

జార్జి : పసివాడు. తెలీకన్నాడు. వాడిబదులు నేను చేస్తున్నాను సెల్యూట్. స్వీకరించండి !

అని జార్జి సెల్యూట్ చేశాడు. జిమ్ కోపంగా అన్నాడు.

జిమ్: దొంగనాకొడుకు! ఎత్తులు వేస్తున్నాడు ఎత్తులు! పిల్లోడితో మాటనిపించి వీడు సెల్యూట్ కొడుతున్నాడు.

జార్జి: వళ్ళో కూచున్న హెన్రీ రోషంతో లేవబోయాడు. హెన్రీని బలవంతంమీద కూచోబెట్టుకున్నాడు జార్జి. హెలియన్స్ ముసలాడు అడిగాడు.

తండ్రి : మే మెవరమో తెలుసా ?

జార్జి : దైవసాక్షిగా తెలీదు.

తండ్రి : మీ వూళ్లో షరీఫ్ మా గురించి నీకు ఏమీ చెప్పలేదా ?

జార్జి: మన్నించాలి ! నా కెవరూ ఏమీ చెప్పలేదు. ఈ ఊళ్లో నే నంత ముఖ్యమైన మనిషిని కూడా కాదు.

తండ్రి : హెలియన్స్‌ని ఎరుగుదువా ?

ఆ మాటతో జార్జి ఉలిక్కి పడ్డాడు. వళ్ళంతా భయంతో గజగజా వణికి పోయింది. నిలువెల్లా కంపించి పోతూ అన్నాడు.

జార్జి: వారి గురించి విన్నాను. కానీ, చూళ్ళేదు. బహుశా, వాళ్ళే మీరయితే మరొక సెల్యూట్ స్వీకరించండి.

అని మళ్ళా సెల్యూట్ చేశాడు జార్జి. జిమ్అన్నాడు.

జిమ్ : చాల్లే నక్కనాకొడకా ! బండి తిప్పుకుని వెనక్కి వెళ్ళిపో !

—జార్జిని తిడుతూంటే హెన్రీ తట్టుకోలేక కీచు గొంతుతో అరిచాడు.

హెన్రీ: ఏయ్ తోడేలూ! మాటలు తిన్నగా రానియ్ మా నాన్నని తిట్టావంటే పళ్లు రాలగొడతాను.

జిమ్‌కి వేడెక్కిపోయింది. చేతిలో వున్న కొరడాని ఝుళిపించి—

జిమ్ : ఏం(టాకూసావ్....

అని కొట్టబోయేందుకు కొరడా నెత్తాడు. జార్జి ఆ కొరడాకి అడ్డం నిలబడి కన్నీటితో వేడుకున్నాడు.

జార్జి: అయ్యా! పసివాడు. వాడినేం చేయకండి. ఆ కొట్టేదేదో నన్ను కొట్టండి. మీ దెబ్బలుతినే ఇంటికి వెడతాను.

జిమ్, జార్జిని చితక బాదుతూ అంటున్నాడు—

జిమ్ : పసివాడూ, పసివాడూ అని వంకతో వాడిచేత మమ్మల్ని అవమానిస్తావా ! నీ వొళ్ళు చీరేస్తేనేగాని బుద్ధి రాదురా నీకు.

కొరడా దెబ్బలకి తట్టుకోలేక పోతున్నాడు జార్జి.

మధ్యలో హెన్రీ ఏదో అరవబోగా, వాడి నోరుని మూసి - కొరడా దెబ్బల్ని మవునంగా భరిస్తున్నాడు జార్జి.

కొట్టి కొట్టి అలిసిపోయేడు జిమ్. హెలియన్స్ ముస లాడు అన్నాడు——

తండ్రి: ఇంక వెనక్కి తిరిగి వెళ్ళిపో! చేతికి దొరికిన పోగరుబోతుని కాల్చకుండ వదిలేయడం ఇది మొదటిసారి, బహుశా చివరిసారికూడాను, పో!

ఒక చేత్తో హెన్రీ నోరు నొక్కిపెట్టి, మరో చేత్తో గుర్రాన్ని వెనక్కి తిప్పి ఇంటిమొహం పట్టాడు జార్జి.

జార్జి వెళ్ళిపోతూండగా, జిమ్ ఒక అందమైన మేడని చూసి అరిచేడు.

జిమ్: అదుగో మేడ! అదే మన విడిది. రండి!

## 16

హెలియన్స్ మేడలో దిగేరు!

ఆ మేడలో వున్న వస్తువులన్నీ తనిఖీ చేసేరు. వాళ్ళ క్కావలసినవన్నీ ఒకచోట చేర్చేరు. విస్కీ సీసాలు తీసు కొని సోఫాలో కూచున్నారు.

జిమ్ చేతుల్లో ఊసుకుని వగైరా కార్యక్రమాలు పూర్తయిం తర్వాత కిటికీలు తనిఖీ చేయడానికి కదిలేడు.

## 17

నైట్క్లబ్బులో జానీతో అంటున్నాడు చార్లీ -

చార్లీ: జానీ! గుండెలమీద చెయ్యి తియ్! వాళ్ళ మకాం నీ ఇంట్లోనే పెట్టేసు.

జానీ కన్నీటితో చార్లీవేపు చూస్తున్నాడు.

## 18

హెలియన్స్ చేతుల్లో జార్జి దెబ్బలు తిన్నాడని బెట్టీ విచారిస్తోంది.

జరిగినదంతా పూస గుచ్చినట్టు తల్లితో చెప్పేడు హెన్రీ! జార్జి కొడుకుని మందలిస్తూ అన్నాడు.

జార్జి: తప్పుకన్నా! పెద్ద పెద్ద విషయాలు నువ్వు మాట్లాడకూడదు. నన్ను తిడితే ఏమైందిటా? - వాళ్ళ నోశే బయట పడింది - అంతేగా! చూడు బెట్టీ! వీడికి బొత్తిగా మేనర్సు లేకుండా పోయేయి. శ్రద్ధ తీసుకుని నేర్పు. అది చాలా అవసరం! ఆ!

—భర్త అతి మంచితనానికి బాధపడాలో, కన్నబిడ్డ రోషానికి సంతోషించాలో తెలీక అవస్థ పడుతోంది బెట్టీ!

## 19

జానీ మేడలో ఖులాసాగా వున్నారు హెలియన్స్!

తాగినంత తాగుతున్నారు. తిన్నంత తింటున్నారు. చాలకపోతే పక్క ఇళ్ళకి వెళ్ళి చేతి కందినంత తెచ్చుకుని మజా చేసుకుంటున్నారు.

తాగి, తిని సుఖపడటంమీాద మొహం మొత్తిం దేమో, ఎవరైనా కాల్చి చంపాలనే పవిత్రాశయంతో హెలియన్స్ సోదరులు వీధినపడి ఊళ్లో జనాన్ని నోటికొచ్చి నట్టు తిడుతున్నారు. దమ్ములుంటే కాల్చుకుందాం బయట పడండని ఛాలెంజీలు చేస్తున్నారు.

— నైట్సు క్లబ్బులో జానీ గుండెలమీాద చెయి తియ్యడమే లేదు. అక్కడున్న వాళ్ళంతా హెలియన్స్ దుర్భాషలు వింటో కళ్ళల్లో నీళ్ళు కళ్ళల్లోనే దాచుకుని - చివరికి చుట్టలు కాల్చడంగూడా మానుకున్నారు.

— విలియమ్స్ ఇంట్లో....

సింహంలాంటి విలియమ్స్‌ని తన కన్నీటితో దాదాపు బంధించి పారేసింది మహా ఇల్లాలు మేరి.

కాగా పోగా—

జార్జి ఇంట్లో మాత్రం మును పెల్లావున్నారో ఇప్పుడూ అల్లానే వున్నారు. కాకపోతే, భయాన్ని దిగమింగుకుని హెన్రీతో ముచ్చటాడుతూ కూచుంటున్నాడు జార్జి. వణికే చేతుల్తో అల్లిక పనులు చేసుకుంటోంది బెట్టీ!

వాతావరణం అతి ప్రశాంతంగా వుంది. ఎవరూ ఎవర్నీ కాల్చడంలేదు. ఎవరూ ఎవర్నీ తన్నడంలేదు. ఆ ఊళ్లో ఏ ఉపద్రవం లేనట్టూ, ఆ ఊరికి శని దాపురించి కల్లోలం చేయనట్టూ, అక్కడున్న వాళ్ళంతా సుఖ సంతోషాల్తో హాయిగా కాలం గడుపుతున్నట్టూ వుంది.

ఒక్క పొగరుబోతూ లేడేమిటాని హెలియన్స

ఆశ్చర్య పోతున్నట్టే - ఈ మాయదారి మహమ్మారి ఎప్పుడు తొలిగిపోతుందాని ఊరివాళ్ళు ఎదురు చూస్తున్నారు.

చిత్రమైన సంధి!

## 20

మూడోనాడు—

జిమ్‌కి దిగులు ఎక్కువకాగా తండ్రితో అన్నాడు....

జిమ్ : ఉత్త ముదనష్టపు ఊళ్లో పారేశావ్! ఇక్కడ నాకేం తోచడంలేదు.

తండ్రి : రేపో ఎల్లుండో మకాం మార్చేద్దాం. సరేనా?

జిమ్ : ఈ తడవైనా మగాళ్ళుండే ఊరుచూడు.

తండ్రి : అల్లాగే!

జిమ్ : సరే! ఎట్టాగో వెళ్ళిపోతున్నాంగా! ఊరంతా చూద్దామనివుంది. వెళ్లిరానా?

తండ్రి : జాగర్త!

జిమ్ పకపకా నవ్వాడు. ఆ నవ్వుని ఆపుకోలేక తండ్రిని రెండు చేతుల్తో పట్టుకుని కుదుపుతూ అన్నాడు....

జిమ్ : ఏంట్రా ముసలోడా? జాగర్తనా? (మళ్ళా నవ్వాడు)) జాగర్తేంట్రా? నీయమ్మ! నీకు దమ్మేమైనా వుంటే నాతో రారా! ఒక్క గుండుతో సఫా! నేను యెవడికీ బయపడన్రోయ్! ఈడు అగ్గిబరాటా!

—అనేసి, థుపుక్కున ఊసి - కోపంతో పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ వీధిలోకి వచ్చాడు జిమ్!

## 21

బిగుతుగా వున్నాయి దుస్తులు.

వంటికి అంటుకు పోయినట్టున్న దుస్తుల్లో రొమ్ము విరుచుకుని నడుస్తున్నాడు జిమ్.

నడుంకి వెడల్పాటి, మందమైన బెల్టు కట్టుకున్నాడు. అటు ఇటు-రెండు వేపులా రెండు పిస్తోళ్లున్నాయి. చేతులు రెండూ, చెరో పిస్తోలుమీదా వున్నాయి. డేగలాగా దిక్కులు చూస్తూ, విలాసంగా అడుగులు వేస్తూ నడుస్తున్నాడు.

జిమ్ నోట్లో ఏమీ లేకపోయినా, ఏదో వున్నట్టు-వున్నదాన్ని నములుతున్నట్టు నములుతున్నాడు.

ఖాళీ ఇళ్ళని చూసి హుషారుగా విజిల్ వేస్తున్నాడు.

ఒక్కోచోట ఆగిపోయి గిర్రున రౌండు కొడుతున్నాడు.

నడిరోడ్డుమీద పిచ్చివాడు నడుస్తున్నట్టు నడుస్తున్నాడు. అప్పటికే వాళ్ళవిడిది వదిలి చాలా దూరం వచ్చేశాడు. అంటే, ఊరుకి అటుచివర్న చేరుకున్నాడన్నమాట. ఇంకా ముందుకి నడిచేవాడేమోగాని - జార్జి పిస్తోళ్ళ షాపు బోర్డు చూసి ఆగిపోయాడు.

ఆ పిస్తోళ్ళషాపుని అదే మొదటిసారి చూడటం. అందువల్ల, కుతూహలంగా ఆ షాపులోకి అడుగుపెట్టాడు.

## 22

అడవిలోంచి బయటపడి ఊళ్లోకి వచ్చిన పులిని చూసి జడుసుకున్నట్టు, జిమ్‌ని చూసి జార్జి భయపడ్డాడు.

జిమ్‌కి ఎదురెళ్ళి స్వాగతం పలికాడు. జిమ్ జార్జిని నఖశిఖ పర్యంతం చూసి, గుర్తుపట్టి అన్నాడు....

జిమ్ : ఓరి నీయమ్మ! గురబ్బండోడివి కదూ ?

జార్జి భయంగా 'చిత్తం' అన్నాడు

జిమ్ షాపు మొత్తాన్ని పరికిస్తున్నాడు. అక్కడ వివిధ రకాల తుపాకులూ, పిస్తోళ్ళనీ చూసి, ముచ్చటపడి, జార్జిని చేత్తో తోసి, షాపు మధ్యలోకొచ్చి నిలబడ్డాడు.

అన్నిరకాల మారణాయుధాల్ని ఒకేసారి చూసి తట్టుకోలేక, రెండు చేతుల్లోనూ ధుపుక్కున ఊసుకున్నాడు. మెళ్ళో జీరాడుతూన్న మురికిగుడ్డని లాక్కొని మొహం తుడుచుకున్నాడు. ఆ తర్వాత జార్జితో అన్నాడు.

జిమ్ : నీయక్క! నీ పిస్తోళ్ళషాపు పిచ్చెక్కించేస్తుందిరా గుఱ్రబ్బండోడా! పోన్లే, మెళ్ళే ముందయినా చూశాను అంతేచాలు. ఒరేయ్, నీ పేరేంటన్నావ్? జార్జి కదూ? జార్జొరేయ్.... ఈ పిస్తోళ్ళన్నీ మూటకట్టేయ్. నా కిచ్చేయ్. వాడింది వాడకుండా, మనిషికొకటి వాడేస్తాను.

—అని వెకిలిగా నవ్వుతున్నాడు జిమ్. వింటున్న జార్జికి మతిపోతోంది. అంత డబ్బుపోసికొన్న పిస్తోళ్ళని జిమ్‌గాడి మొహాన్న కొట్టాలంటే బాధగానే వుంది. జార్జికి ఏం చేయాలో తోచడంలేదు.

అంతలో....

జిమ్ ఒక కొత్తరకం పిస్తోలు తీసుకుని, దాని తయారీ విధానానికి ముచ్చట పడుతున్నాడు. దాన్ని ముద్దు కూడా పెట్టుకున్నాడు. జార్జితో అన్నాడు.

జిమ్ : జార్జొరేయ్ ! దీన్నెట్టాగరా కాల్చేది ?

జార్జి: వినయంగా ఆ పిస్తోలుని తీసుకున్నాడు. ఆ పిస్తోల్లో ఏది ఎక్కడ వుందో వివరించి చెప్పాడు. దాన్నెలా గురిచూసి, ఎల్లా కాల్చాలో వివరించే ప్రయత్నంలో....

తూటాల్తో నిండివున్న ఆ పిస్తోలు కాస్తా 'ధన్' మని పేలింది! పిస్తోలుకి ఎదురుగా నిలబడివున్న జిమ్ గుండెల్లోకి తూటా దూసుకుపోయింది....

జిమ్ కెవ్వున కేక పెట్టాడు. నేలమీద కూలిపోతూ బాధగా అన్నాడు.

జిమ్ : అమ్మనాకొడకా ! చంపేశావురా ! నా చావు నీ చేతుల్లో వున్నాదని తెలుస్తే నీ పాపుకి వచ్చే....వాడి.... నే....కా....దు....

అంతే !

జిమ్ ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. ఈ బీభత్సాన్ని చూళ్ళేక జార్జి కెవ్వున కేక పెట్టాడు.

## 23

జాని మేడలో హెలియన్స్ ముసలాడికి పిస్తోలు శబ్దం వినిపించింది.

ఉలిక్కిపడి లేచి 'ఎవడ్రా అది ?' అని అరిచాడు. అంతలో ఒకదాని తర్వాత ఒకటి వరసగా పిస్తోళ్ళ శబ్దాలు వినిపించాయి.

మేడమీద హెలియన్స్ సోదరులు బాగా తాగేసి, ఆ మైకంలో గాల్లోకి పిస్తోళ్ళు కాల్చుతున్నారు. అది చూసి హెలియన్స్ ముసలాడు అనుకున్నాడు.

తండ్రి : చేతినిండా పన్లేకపోతే ఇంతే మరి !

ఆ తర్వాత—

ఎంతసేపటికీ జిమ్ రాకపోతే, పేరుపెట్టి జిమ్‌ని పిలుస్తున్నాడు ముసలాడు. బదులు రాలేదు. వీధిలోకి వచ్చి పిలుస్తున్నాడు.

## 24

జార్జి నిలువెల్లా వణికిపోతున్నాడు.

తనముందున్న జిమ్ గాడి శవం, తన కుటుంబానికి ఉరితాడుగా కనుపిస్తోంది. బెట్టీ చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని పిచ్చివాడిలాగా గొణుక్కుంటున్నాడు.

జార్జి : ఘోరం జరిగిపోయింది బెట్టీ! ఇప్పుడేం చేయాలి? నే నేం చేయాలి బెట్టీ ! ఏం చేయాలి !

—హెన్రీ జిమ్‌గాడి శవాన్ని చూసి చప్పట్లు కొడుతూ గంతులేస్తూ అంటున్నాడు.

హెన్రీ : భలే.... భలే......... నాన్న తోడేలు గాడిని చంపేశాడు భలే.... భలే....

—జార్జి, హెన్రీ నోరుని మూసి భయంగా అన్నాడు.

జార్జి : గట్టిగా అరవకు కన్నా ! నేను చంపింది తోడేల్ని కాదురా.... పులి పిల్లనిరా! పులి పిల్లని! ఈ సంగతి తెలిస్తే మన ప్రాణాలు దక్కవు.

జార్జి బెట్టీ సాయంతో ఆ శవాన్ని ఒక బల్ల వెనక్కి లాక్కొచ్చి దాచాడు. నేలమీద నెత్తురు మరకల్ని కడిగి తుడిచి శుభ్రం చేశాడు.

బెట్టీ సలహా యిచ్చింది.

బెట్టీ: ఊరి యోధులంతా నైట్ క్లబ్బులో వుంటారు. అక్కడికి వెళ్ళి జరిగింది చెప్పు. సాయం చేయకపోరు!

జార్జి: థాంక్సు బెట్టీ! ఖంగార్లో నాకు ఆ ఆలోచనే రాలేదు. మంచి సలహా యిచ్చావు. హెన్రీ జాగ్రత్త. ఇప్పుడే వస్తా.

—అనేసి వణికే కాళ్ళతో ఇల్లుదాటి బయట పడు తున్నాడు.

## 25

ఎంతసేపటికీ జిమ్ తిరిగి రాకపోవడంతో హెలియన్స ముసలాడికి అనుమానం ఎక్కువయింది.

వీధిలో నడుస్తూ ఎలుగెత్తి కొడుకుని పిలుస్తున్నాడు.

తండ్రి : ఒరేయ్ జిమ్! ఎక్కడున్నావురా దొంగనా కొడకా? ఒరేయ్ పలకరా! జిమ్.... జిమ్....

## 26

నైట్ క్లబ్ లో జార్జి చెప్పిందంతా విని అవాక్కయి పోయారు - వీరయోధులు.

జార్జి పిచ్చెక్కినట్టు యింకా చెబుతూనే వున్నాడు....

జార్జి: నన్ను నమ్మండి. చంపాలని చంపలేదు. ఆ పిస్తోలు ఎల్లా కాల్చాలో చెబుతూంటే పొరపాటున పేలింది. కాదు-అజాగ్రత్తగా వుండడంవల్ల పేలింది. అదీ కాదంటే, ఖంగార్లో పేలింది. అంతే! వాడు చచ్చాడు. మహా ప్రభువులూ! నే నెల్లాంటి మనిషినో మీ అందరికీ తెలుసు! మనిషిని చంపేపాటి హీరోనా? కానండీ, ఈ జన్మకి కాలేను! తెలిసిచేసిన తప్పు కాదండీ ఇది! ఇప్పుడు మీరు, నాకూ నా కుటుంబానికీ రక్షణ ఇవ్వకపోతే సర్వనాశనమైపోతాం. నా పాపుతో సహా మట్టికొట్టుకుపోతాం. అయ్యా! నాకు రక్షణ ఇవ్వండి. మా ప్రాణాలు కాపాడండి.

—జార్జి పసిపిల్లవాడిలా వలవలా ఏడుస్తున్నాడు.

—జాని గుండెలమీద చెయ్యి వుంచుకునే అంటున్నాడు.

జాని: వీల్లేదు! వాడిని చంపింది చాలక ఇక్కడికొచ్చి మా ప్రాణాలమీదికి తీసుకొస్తావా పుండాకోర్! నీలాటి హంతకుడ్ని ఇక్కడ దాచామని తెలుస్తే, వాళ్లొచ్చి మమ్మల్నీ, మా క్లబ్బునీ తుడిచిపెట్టేస్తారు. వెళ్ళిపోరా సచ్చినోడా! గెటవ్‌ట్.

—అని జాని గూడా ప్రాణభయంతో వలవలా ఏడుస్తున్నాడు.

జార్జి: అయ్యా! అంతమాటనకండి బాబూ! వీరాధివీరులు. మీ ప్రాణాలకి భయపడి, అల్పుడ్ని, నన్ను వెళ్ళిపొమ్మనడం మీకు ధర్మంగాదు. కనికరించండి. మీరంతా ఒకటై నిలిస్తే వాళ్లెంత? వాళ్లు నలుగురేనండి! ఒక్కొక్కడు

రెండు పిస్తోళ్ళు తీసుకుంటే మొత్తం ఎనిమిదేనండీ పిస్తోళ్లు. ఇక్కడున్న వాళ్లనీ లెక్కపెట్టండి. ఒక్కొక్కరికి రెండేసి పిస్తోళ్ళివ్వండి, అప్పుడు మొత్తం ఎన్ని అవుతాయి?

జాని: ఒరేయ్ శనిగా ఇప్పుడు లెక్కల గొడవ్వద్దురా! ముందిక్కడ్నుంచి వెళ్ళిపో! లేదా, నిన్ను కాల్చిపారేస్తాను. అంతే!

—ఇదంతా ఓపిగ్గా చూస్తున్న ఛార్లీ, జానీని వారించి జార్జితో అంటున్నాడు.

ఛార్లీ: చూడూ, బలాబలాలు తేల్చుకోవడానికి ఇది సమయం కానేకాదు. నిన్ను కాపాడే బాధ్యత ఆ దేవుడికే వదిలివేశాం. ఒక పనిచెయ్యి. వెంటనే ఇంటికెళ్ళిపో. నీ పెళ్లాం బిడ్డల్ని గుర్రబ్బగ్గీ ఎక్కించుకుని - దొంగచాటుగా- హెలియన్స్ కనిపించకుండా, వూరొదిలి పారిపో! మరో ఊళ్లో తలదాచుకో. ఇంక ఇంతకంటె వేరేమార్గం లేదు. అసలే, మతులుపోయి ఏడుస్తున్న మమ్మల్ని రొంపిలోకి లాక్కు. వెళ్ళరా నాయనా! వెళ్ళిపో!

—అంటూ జార్జిని బయటికి గెంటి తలుపు మూసేడు. ఆ తర్వాత జానీతో అన్నాడు.

ఛార్లీ: జానీ, నీ గుండెలమీద చెయ్యి-

జాని: తియ్యను! ఈ వూరునుంచి హెలియన్స్ ముండాకొడుకులు వెళ్ళిపోయేంతవరకూ ఈ చెయ్యి ఇక్కడే వుంటుంది. అది నా యిష్టం. ఫో!

## 27

జిమ్‌ని పిలుచుకుంటూ హెలియన్స్ తండ్రి పిచ్చి కుక్కలా వీధులు తిరుగుతున్నాడు.

చిట్టచివరికి....

జార్జి పిస్తోళ్ళ షాపు ముందుకొచ్చి ఆగిపోయాడు. జిమ్‌గాడికి పిస్తోళ్ళంటే మోజన్న విషయం గుర్తుకురాగా, ఆ షాపుకి తప్పకుండా వచ్చి వుంటాడనే అనుమానంతో-షాపులోకి అడుగు పెట్టాడు. అడుగు పెడుతూనే 'జిమ్' అని పిలిచాడు.

ఆ పిలుపుకి బెట్టీ గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి. గజ గజ వణికిపోతోంది.

నిలువెత్తు ఆకారాన్ని గుమ్మంలో చూడంగానే నోట మాట పడిపోయింది బెట్టీకి.

హెలియన్స్ తండ్రి బెట్టీని చూశాడు. మరుక్షణమే అడిగాడు.

తండ్రి: ఏమే పిల్లా! మా జిమ్‌గాడు ఇక్కడగ్గాని వచ్చాడా?

—బెట్టీ బదులివ్వలేక పోయింది. బెదురు చూపులు చూస్తోంది. హెలియన్స్ తండ్రి గాండ్రించేడు....

తండ్రి: నిన్నే! జిమ్‌గాడు వచ్చాడా అని అడుగుతున్నా! జవాబు చెప్పు....

—బెట్టీ వణికిపోతూ అన్నది....

బెట్టీ: జిమ్మా? జిమ్మెవరు? ఇక్కడికి ఎవరూ.... ఎవరూ రాలేదు... ఆ! నామాట మీరు నమ్మాలి!

—ఆ తొట్రుపాటు గమనించిన తర్వాత ముసలాడికి అనుమానం కలిగింది. "రాలేదూ...." అంటూ ముందుకు వస్తున్నాడు. వాడిపక్కనే జిమ్ శవాన్ని దాచిన బల్లవుంది. పొరపాటున అటు తొంగిచూశాడు....

గభాలున బెట్టీ వెళ్ళి ఆ బల్లకీ - ముసలాడికీ మధ్యన నిలబడింది. గబగబా అంటోంది.

బెట్టీ : నిజమండీ! ఎవరూ రాలేదు.నన్ను నమ్మండి....

—అంత దగ్గర్లో ఆడదాన్ని చూడగానే ముసలాడికి మతిపోయింది. నరాలు జివ్వు మన్నాయి కాబోలు. వెకిలిగా నవ్వడం ప్రారంభించి ఆమెచుట్టూ చేతులు వేస్తూ అన్నాడు.

తండ్రి : నీయమ్మ! నీ అందంతో నామతి పోగొడు తున్నావే ముండ! చచ్చిన నా పెళ్ళాం గుర్తుకొస్తుందనుకో! రా! నన్ను తృప్తిపడనీ! రా !

—ఈ కొత్తరకం కోరికతో బెట్టీ యిరుకున పడింది. 'వద్దు' అన్నది. కానీ, ముసలాడు ఆగలేదు. బలమైన తన బాహువుల్లో బెట్టీని బంధించాడు. బెట్టీ అతన్నుంచి తప్పుకో డానికి గిల గిలా తన్నుకుంటోంది. ముసలాడికి ఉత్సాహం ఎక్కువయ్యింది. విజృంభించాడు. అతి కష్టంమ్మీద గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు. అక్కడితో ఆగక బెట్టిని లోబరుచుకు నేందుకు సిద్ధపడుతూండగా....

జానీ మేడలోంచి హెలియన్స్ సోదరులు కాల్చు కుంటున్న పిస్తోళ్ళ శబ్దాలు వినిపించాయి.

బెట్టీని వదిలేసి హెలియన్స్ సోదరులను తిట్టుకుంటూ, గబగబా జానీ మేడ వేపు నడిచాడు.

బెట్టీ నిట్టూర్చింది ! గండం తప్పినందుకు. గాలి పీల్చు కుంది.

## 28

జార్జి దొడ్డివేపు తలుపుని దబదబా బాదుతున్నాడు. బెట్టి వచ్చి తలుపు తెరిచింది. జార్జి ఇంట్లోకివస్తూ అన్నాడు.

జార్జి : టైంలేదు. మూటా ముల్లె సర్దు. బండి సిద్ధంగా వుంది.

బెట్టి దిగులుగా అడిగింది....

బెట్టి : బండి అంటున్నారేమిటి? యోధు లేమన్నారు?

జార్జి : పారిపొమ్మన్నారు! ఏవూళ్లోనైనా తల దాచుకో మన్నారు.

బెట్టి : ఆశ్రయం ఇవ్వలేమన్నారా ?

జార్జి : పాపం ! అసలే వాళ్లు ప్రాణభయంతో అల్లాడి పోతున్నారు మనల్ని ఆదుకుంటే ఇంకా ఏమైనా వుందా ? నయం ! మనల్ని హెలియన్స్‌కి వప్పగించారు కారు. వాళ్ళ కనికారానికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి. పద పద....

—అవసరమైన వస్తువుల్ని మూటగట్టుకుని బెట్టీ తోనూ, హెన్రీతోనూ గుర్రబ్బగ్గీ ఎక్కాడు. దొంగదారుల గుండా రైల్వేస్టేషను వేపు గుర్రబ్బగ్గీని తోలుతున్నాడు జార్జి.

## 29

జానీ మేడలో హెలియన్స్ తండ్రి, తన కొడుకుల్ని తిడుతున్నాడు....

తండ్రి: చెడపుట్టార్రా! గొంతువరకూ తాగడ మెందుకూ, తూటాలు వృధా చేయడమెందుకూ? ఇల్లొదిలి వెళ్ళాడు జిమ్. వాడి అతీగతీ కనుక్కోడం లేదా?

ఒకడు: నీకు వాడంటె ప్రేమెక్కువ అందుకే, కాలు కాలిన కోతిలాగా అరుస్తున్నావ్. వస్తాడ్లే.

తండ్రి గొణుక్కుంటున్నాడు.

తండ్రి: ఏ మొస్తాడో! అసలే బండనాకొడుకు! పది మందిని కాల్చగలడేగాని, బుర్రలో వున్నదంతా మట్టే!

# 30

ఎట్టకేలకి జార్జి రైల్వేస్టేషను చేరుకున్నాడు....

కదలబోతూన్న రైల్లో బెట్టీని, హెన్రీని కూచోబెట్టి, తెచ్చుకున్న కొద్దిపాటి లగేజీని ఎక్కించి, ఆపైన పెళ్ళాం బిడ్డలమధ్య కూర్చుని-

"భగవంతుడా! రక్షించావ్!" అనుకున్నాడు....

రైలు కదిలింది.

బెట్టి, జార్జి చేతిని ప్రేమతో నొక్కింది. జార్జి ఆనం దంగా వున్నాడు. హెన్రీ తలని ప్రేమతో నిమిరి వాడి చుబు కాన్ని ముద్దు పెట్టుకోబోయాడు.

ఆశ్చర్యం!

హెన్రీ తండ్రి చేతిని విదిలించి కొట్టాడు రోషంగా....

జార్జి కలవరపడ్డాడు. హెన్రీని ప్రేమగా అడిగాడు.

జార్జి: ఎందుకురా కన్నా! అంత కోపం ?

హెన్రీ: కోపం రాదేమిటీ? చిన్న తోడేలుగాడి శవం దగ్గిర కూచుని అంతా చూశాను. అమ్మని ముసలి తోడేలుగాడు ముద్దు పెట్టుకున్నాడు. అప్పుడు నువ్వు లేవు. నే నరుస్తే అమ్మని ఆ ముసలి తోడేలుగాడు చంపుతాడేమో నని అరవలేదు. వాడ్ని చంపిగాని పారిపోగూడ దనుకున్నాను. నువ్వే.... నీమూలాన్నే పారిపోతున్నాం.... పారిపోవడం.... ఛీ....

—జార్జికి ఆ మాటలు గుండెల్లో శూలాల్లాగా గుచ్చు కున్నాయి. అసహనంగా కదిలి భార్యవేపు చూశాడు. బెట్టీ మెల్లిగా అన్నది.

బెట్టీ: జరిగిందేదో జరిగిపోయింది! ఆవేశపడకు జార్జి! మన ప్రాణాలు క్షేమంగా వున్నాయి. అంతేచాలు!

—జార్జి గుప్పెట బిగిసింది. కళ్ళు ఎర్రపడ్డాయి. అంత మెత్తటి మనిషి, భార్యకి జరిగిన పరాభవానికి సింహమై పోయాడు. తుపాకీ చేత్తో పట్టుకున్నాడు. బెట్టీ వద్దంటున్నా, నడుస్తున్న రైల్లోంచి దూకి, వూరివేపు పరుగెడుతున్నాడు....

## 31

జానీ మేడలో....

హెలియన్స్ని తండ్రి కాలుకాలిన పిల్లిలా తిరుగు తున్నాడు. జిమ్‌కేదో కీడు జరిగే వుంటుందని శంకిస్తున్నాడు.

జిమ్‌నెవరు ఏం చేశారు!

ఇదే ఆలోచనతో, బాధతో అతనొక చోట స్థిమితంగా నిలబడలేక సతమతమైపోతున్నాడు.

# 32

ప్రళయకాల రుద్రుడిలాగా, భయంకర పిశాచంలా వున్నాడు జార్జి....

పెద్దపెద్ద అంగల్తో వూళ్లోకి ప్రవేశిస్తున్నాడు. ఇన్నేళ్లూ చలిచీమలాగా బతికిన జార్జి ఇవాళ ఈ క్షణంలో త్రినేత్రుడై నడుస్తున్న భూమికే భయాన్ని కలిగిస్తున్నాడు.

ఊళ్ళో ఒకచోట నిలబడి పొలికేక పెట్టాడు...

జార్జి: రేయ్ ముసిలీ! హెలియన్సంటే నాకిప్పుడు భయం లేదురా! అన్నింటికీ తెగించి వచ్చాను. కమాన్, దమ్ములుంటే నా ముందుకొచ్చి నిలబడు. రేయ్ ముసిలీ! ఎక్కడ్రా నువ్వు?

—ఈ పిలుపు మొట్టమొదట నైట్సు క్లబ్బుని కలవరపెట్టింది. జానీ ఒకచేత్తో గుండెను పట్టుకుని, మరో చేత్తో చావబోయే జార్జి నిమిత్తం ప్రార్థన సంకేతం చేస్తున్నాడు.

-జార్జి రంకెలు షరీఫ్ విలియమ్స్‌కూడా వినబడ్డాయి కేకలు వినీ వినడంతోటే నిటారుగా నిలబడ్డాడు. మేరీ వేపు చూస్తూ అన్నాడు....

విలి: విన్నావుగా! ఆ అమాయకుడ్ని కాపాడే బాధ్యత నాది! ఇంక నీ కన్నీరు నన్నాపలేదు.

మేరీ ఆందోళన పడుతోంది.

## 33

చిట్టచివరిగా....

జార్జి ఛాలెంజి - జానీ మేడలోవున్న హెలియన్స్‌కి వినిపించింది.

క్షణం తత్తరపాటు చెందారు. కిటికీలోంచి తలలుపెట్టి వీధిలోకి చూశారు. చేతిలో తుపాకీతో శివమెత్తినట్టు ఊగిపోతూన్న జార్జి వాళ్ళ కంటబడ్డాడు.

హెలియన్స్ సోదరులు గబగబా పిస్తోళ్ళు సర్దుకుంటున్నారు. వాళ్ళముందు తండ్రివచ్చి నిలబడి చిరునవ్వుతో అంటున్నాడు....

తండ్రీ : ఆగండి. వాడు పిలుస్తున్నది నన్ను. మన కాళ్ళా వేళ్ళా పడ్డ ఒక వెర్రి వెధవకి ఈ పౌరుషం ఎందుకు తన్నుకొచ్చిందో ముందు మనకి తెలియాలి. ఎవరూ అతన్ని కాల్చొద్దు!

– వీధిలో....

జార్జి యింకా అరుస్తునే వున్నాడు....

జార్జి : ఇంట్లో మగాడు లేని సమయంలో దొంగలా వచ్చి నా భార్యని ముద్దు పెట్టుకోడం గొప్ప కాదురా ముసిలీ! ఇవాళ నువ్వో - నేనో తేలిపోవాలి. బయటపడు. నా ముందు నిలబడు.

హెలియన్స్ తండ్రి ముసి ముసిగా నవ్వుకున్నాడు. కొడుకుల్తో అన్నాడు....

తండ్రి: అదీ సంగతి! వాడి కోపానికి కారణం నా ముద్దుట! భేష్! వాడిని తిట్టినా రోషం రాలేదుగానీ, వాడి పెళ్ళాన్ని ముద్దెట్టుకున్నందుకు శివాలు తొక్కుతున్నాడు. చావుని సైతం కేర్ చేయనంటున్నాడు. ఈ ఊళ్లో మొగాళ్లే లేరనుకున్నాం. చివరికి దొరికేడు! వాడంటే నా కెంతో ఇష్టంగా వుంది. వాడి రూపాన్ని చూసి వెధవనుకున్నందుకు మనల్ని వెధవల్ని చేసేడ్రా అబ్బాయిలూ! .... పిస్తోలివ్వండి. ఒకే తూటా చాలు. కమాన్ క్విక్!

—తండ్రి కోరిక ప్రకారం పిస్తోలిచ్చేరు. ఆ పిస్తోల్లో ఒకే తూటాని నింపేరు.

జార్జి యింకా అరుస్తూనే వున్నాడు.

జార్జి: రావేమిరా ముసిలీ! నా చేతిలో నీది రెండో చావురా! ఖంగార్లో నీ కొడుకుని కాల్చేను. కసితో నిన్ను కాల్చిగాని నిద్రపోను. కమాన్.

—జిమ్‌ని చంపేశన్న నిజం తెలీడంతో ముసలాడు అదిరిపోయాడు. వెను వెంటనే మూర్తీభవించిన కసిగా మారిపోయేడు. ఆవేశంతో మేడలోంచి బయటికి పరుగెత్తాడు.

జిమ్ చచ్చేడన్న వార్త విన్న మిగతా సోదరులు గూడా పిస్తోళ్ళు పుచ్చుకుని పెద్ద పెద్ద అంగల్తో మేడ వదిలి వీధిలోకి వస్తున్నారు.

## 34

షరీఫ్ విలియమ్స్ - హెలియన్స్ రావడం చూసేడు భీకర మూర్తులైన హెలియన్స్‌ని.

మేరీగూడ చూసింది. క్షణంకూడా ఆలస్యం చేయకుండా తుపాకీ తెచ్చి విలియమ్స్ కిచ్చి అన్నది.

మేరి : విల్లీ! నిన్ను నే నేమీ కోరలేదు. ఆ రక్కసుల్ని చంపి, ఈ గంగిగోవుని రక్షించు. వెళ్ళిరా.

విలియమ్స్, తుపాకీతో కిటికీలోంచి గభాలున దూకేడు.

## 35

వెన్నెలరాత్రి! నిర్మానుష్యమైన వీధి!

హెలియన్స్ తండ్రి గంభీరంగా నడుస్తున్నాడు. అతని వెనకాల హెలియన్స్ సోదరులు కాపు కాస్తూ నడుస్తున్నారు.

హెలియన్స్ ముసలాడు, దూరంగా వస్తున్నట్టు చూసిన జార్జి, ఆ ముసలాడివేపు నిర్భయంగా నడుస్తున్నాడు. ఆ నడకలో కసి కనపడుతోంది.

ఇరు పక్షాలకీ కనుపించకుండా షరీఫ్ విలియమ్స్ తన తుపాకీతో జాగ్రత్తగా నడుస్తున్నాడు.

ఒక్కో క్షణం అతి భయంకరంగా సాగుతోంది!

నైట్సుక్లబ్బులో వీరయోధులు పిచ్చి చూపులు చూస్తున్నారు. ఉన్నట్టుండి చార్లీ రోషంగా అన్నాడు....

చార్లి: జానీ! నీ గుండెమీద—

జాని: చెయ్యి తీసేను. ఇప్పుడు నా రెండు చేతుల్లోనూ పిస్తోళ్లున్నాయి. మన కళ్ళముందు చీమలాగా బతికిన జార్జిగాడు ఏనుగవుతూంటే, ఏనుగుల్లాంటి మనం దోమల మవుతామా? సిగ్గు, తీసుకో తుపాకీ! నన్ను అనుసరించు.

— మొత్తం నైట్సుకళ్ళబ్బే తుపాకుల్తో క్లబ్బునుంచి బయట పడింది....

హెలియన్స తండ్రీ, జార్జీ ఎదురెదురుగా నిలబడి వున్నారు. లెక్కపెట్టుకుంటున్నట్టు క్షణాలు లెక్కిస్తున్నారు. ఉన్నట్టుండి ముసలాడు పిస్తో లెత్తేడు....

అంతే....

జార్జి తుపాకినుంచి తూటాలు టిష్యూ టిష్యూమంటూ నిప్పులు కక్కుతూ బయటికి వచ్చేయి. హెలియన్స తండ్రి కూలిపోతున్నాడు. కూలిపోతున్న వాడిని యింకా కాలుస్తూనే వున్నాడు జార్జి. ఒక్కో తూటాకి ఒక్కో గొంతుతో కెవ్వు కెవ్వున అరుస్తూ - చిట్ట చివరికి నెత్తురు మడుగులో కుప్పలా కూలిపోయేడు హెలియన్స తండ్రి.

హెలియన్స సోదరులు ఒకేసారి జార్జిని కాల్చబోయారు!

విలియమ్స తుపాకీ పేలింది. ఒకడు రాలిపోయేడు. జాని పిస్తోళ్లు పేలేయి. మరొకడు చావు కేకతో ప్రాణాలు

పడిలేడు. చార్లీ వాడిన తూటాకి మూడోవాడు దబ్బున పడిపోయేడు.

పడిపోయిన వాడు, ఊరుకోకుండా పిస్తోలు ఎత్తాడు. జార్జి, విలియమ్స్, జాని, చార్లీ - తలోవేపునుంచి వాడ్ని కాల్చారు.

ఆ నేలమీద నలుగురి హెలియన్స్ శవాలూ వికృతంగా పడి వున్నాయి. అదే చోటులో మునుపు జార్జి హెలియన్స్ కొరడా దెబ్బలు తిన్నాడు.

జార్జి ఆ శవాల్ని కసిగా చూశాడు. చేతిలో వున్న తుపాకీని ఆ శవాలమీద విసిరాడు. వెనుతిరిగేడు.

దూరంగా భార్యా బిడ్డలు కనుపించారు. వాళ్ళవేపు నడుస్తున్నాడు....

ఇప్పుడతను చలిచీమలాగా లేడు! మేరు పర్వతంలా, ప్రళయకాల రుద్రుడిలా కనుపిస్తున్నాడు!

—: o :—